# నమస్తే తెలంగాణ
# హైదరాబాద్
హైదరాబాద్- మేడ్చల్
I | హైదరాబాద్, శుక్రవారం 23 మే 2025 | HYDERABAD




## పరిశీలించి.. ఆదేశించి..

సిటీబ్యూరో: ఎల్బీనగర్ జోన్‌లో పలు అభివృద్ధి పనులను గురువారం బల్దియా కమిషనర్ ఆర్ వీ కర్ణన్ పరిశీలించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ సర్కిల్‌లో పలు అభివృద్ధి పనులు పరిశీలించారు. వెంకటేశ్వర కాలనీలో రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు కమిషనర్‌కు కలిసి కాలనీకి సంబంధించి సమస్యలు వివరించగా, పరిష్కరించాలని జోనల్, డిప్యూటీ కమిషనర్‌లను ఆదేశించారు. గడ్డిఅన్నారం డివిజన్‌లో బాక్స్ డ్రైయిన్ పనులను పరిశీలించి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. వల్లభ నగర్‌లో వాటర్ లాగింగ్ పాయింట్‌ను కమిషనర్ పరిశీలించారు. కమిషనర్ వెంట జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్, ఎస్ఈ అశోక్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్లు తదితరులు ఉన్నారు.



వర్ష సూచన

సిటీబ్యూరో: ఆవర్తన ప్రభావంతో గురువారం రాత్రి 9గంటల వరకు మౌలాలి, లాలాపేటలో 2సెం.మీలు, ఉప్పల్ మల్లాపూర్‌లో 1సెం.మీలు, చిలుకానగర్‌లో 7మి.మీల చొప్పున వర్షపాతం నమోదైనట్లు వాతావరణ కేంద్రం అధికారులు వెల్లడించారు. రాగల మరో రెండు రోజులు వానలు కురిసే అవకాశమున్నదన్నారు.

# బడుగు జీవులపై బుల్డోజర్

## నోటీసులు ఇవ్వకుండానే హైడ్రా కూల్చివేతలు

### వేడుకున్నా.. కనికరించని అధికారులు
### కేసీఆర్ పాలనే బాగుందేనన్న బాధితులు
### రేవంత్‌కు ఉసురు తగులుతుందని శాపనార్థాలు



నిర్మాణాలను కూల్చివేస్తున్న దృశ్యం

**మేడ్చల్, మే 22 (నమస్తే తెలంగాణ):** మేడ్చల్ జిల్లా పీర్జాదిగూడ కార్పొరేషన్ పరిధిలోని పర్వతాపూర్ పరిధిలో గురువారం హైడ్రా చేపట్టిన కూల్చివేతలు ఉద్రిక్తతలకు దారితీసింది. ఎలాంటి సమాచారం అందించకుండా బాధితులు ఎంతగా వేడుకున్నా.. సమయం ఇవ్వాలని కోరినా..కనికరించకుండా అనుమతులు ఉన్న ఐదు నిర్మాణాలను కూల్చివేశారు. దీంతో కష్టపడి సంపాదించిన డబ్బులతో పాటు తమ ఊర్లలో ఉన్న భూములను అమ్మితే వచ్చిన డబ్బులతో స్థలం కొనుగోలు చేసుకుని నిర్మాణాలు చేసుకుంటే హైడ్రా పేరిట తమ జీవితాలను రోడ్డున పడవేశారని బాధితులు ఆరోపించారు. కేసీఆర్ పాలననే బాగుండేనని చెప్పిన బాధితులు.. కాంగ్రెస్ పాలనపై దుమ్మెత్తిపోశారు. రేవంత్‌రెడ్డికి ఉసురు తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.

### రోడ్డున పడేస్తున్నారు

**-బాధితుడు మధుసూదన్‌రెడ్డి**



హైడ్రా పేరుతో రోడ్డున పడేస్తున్నారు. కష్టపడి సంపాదించి కోనుకున్న స్థలంలో నిర్మించిన ఇంటిని కూల్చి వేయడం అన్యాయం. ఇంటి అనుమతులు ఉన్నా.. కూల్చివేస్తున్నారు ఎందుకు. పేదలను కష్టపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచిది కాదు. నిర్మాణాన్ని కూల్చివేస్తుంటే అడ్డుకుంటే నాపై దౌర్జన్యం చేశారు. పేదల కష్టాలు కాంగ్రెస్ పట్టావా మా జీవితాలతో ఆడుకుంటున్న కాంగ్రెస్‌కు మా ఉసురు తప్పదు

### నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేస్తారా..

**-బాధితుడు అలేటి రజనీకాంత్‌రెడ్డి**



రేవంత్‌రెడ్డి పేదవాళ్లను బెదిరించి పెద్దవాళ్ల వద్ద వసూళ్లు చేసుకుంటున్నారు. నోటీసులు ఇవ్వకుండానే కూల్చివేస్తారా.? ఉదయం 5 గంటల ప్రాంతంలో వచ్చి ఎలాంటి సమాచారం అందించకుండా కూల్చివేతలు ప్రారంభించారు. నా నిర్మాణానికి అన్ని అనుమతులు ఉన్న క్రమంలో ఐదేండ్లుగా ఇంటి పన్నులు కూడా చెల్లిస్తున్నాం. కరెంట్ బిల్లులు కడుతున్నాం. ఉదయం 5 గంటలకు అధికారులు వచ్చి కూల్చివేస్తున్నామని చెప్పి.. వెంటనే కూల్చివేతలు ప్రారంభించారు. రెండు రోజులు సమయం ఇవ్వాలని అధికారులను కోరినా వినలేదు. ఇందులో ఉన్న సామన్లు సర్దుకుంటామని చెప్పినా వినకుండా కూల్చివేతలు ప్రారంభించారు. మాకు రూ. 20 లక్షల ఆస్తినష్టం వచ్చింది. మా ఇళ్లు ఉన్న సర్వే నంబర్‌లో పెద్ద పెద్ద బడాబాబుల అపార్ట్‌మెంట్‌లు ఉన్నాయి. వాటిని కూల్చడం లేదు. పేద వాళ్ల ఇండ్లను మాత్రమే కూల్చుతున్నారు.

### మాకు న్యాయం చేయాలి

**- బాధితురాలు అరుణ**



నా పిల్లల ఉసురు రేవంత్‌రెడ్డికి తగులుతుంది. ఉన్న రెండు ఎకరాలు ఊర్లోలో అమ్మి స్థలం కొనుకొని షెడ్డు వేసుకుని జీవిస్తుంటే కూల్చివేస్తున్నారు. స్థలం కొనుక్కొని లోన్ తీసుకుని షెడ్డు నిర్మించుకుంటే హైడ్రా కూల్చివేతలతో రోడ్డు మీద పడ్డాం. ఎంతో కష్టపడి ఇంటిని నిర్మించుకుంటే మాపై దయ చూపకుండా కూల్చివేస్తున్నారు. మాకు న్యాయం చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. ఊర్లో అమ్ముకున్న భూమితో పాటు కొనుకున్న స్థలం పోతే మేము ఎలా బతకాలి.

# దారి తప్పిన సీఆర్ఎంపీ

## మళ్లీ ఏజెన్సీలతోనే నిర్వహణ పనులు చేపట్టేందుకు టెండర్లు

### వర్షాలు పడుతున్న వేళ మేల్కొనడంపై విమర్శలు

సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ): గుంతలు లేని ప్రయాణమే లక్ష్యంగా సీఆర్ఎంపీ రోడ్లకు శ్రీకారం చుట్టి ఇతర మెట్రో నగరాలకు ఆదర్శవంత పథకంగా బీఆర్ఎస్ తీర్చిదిద్దితే కాంగ్రెస్ ప్రభుత్వంలో మళ్లీ గుంతలమయమైన రహదారులు వాహనదారులకు దర్శనమిస్తున్నది. దీనికి కారణం జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యమే అని చెప్పక తప్పదు. వాస్తవంగా 4 విభాగాలుగా సీఆర్ఎంపీ రోడ్లను విభజించి నిర్వహణ చేపడుతున్న ఏజెన్సీల గడువు గత డిసెంబర్ నెలతో ముగిసింది. అధికారులు సీఆర్ఎంపీ రోడ్లను ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పగించకుండా సొంతంగా నిర్వహిస్తున్నారు. ఫలితంగా చాలా చోట్ల రహదారులపై గుంతలు ఏర్పడిన మరమ్మతులు చేయకపోవడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వర్షాలు పడుతున్న వేళ.. ఆ జూన్ వరకు పనుల కోసమంటూ తాజాగా సికింద్రాబాద్ జోన్‌లో టెండర్లు పిలిచారు. లేన్ మార్కింగ్‌లు, క్యాచ్‌పిట్స్ మరమ్మతులు, పుట్‌పాత్‌లు, సెంట్రల్ మీడియన్లకు రంగులతో సహా సీఆర్ఎంపీ రోడ్ల నిర్వహణకు రూ.1.03 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు పిలిచారు. మిగతా జోన్లలోనూ టెండర్లు పిలిచి పనులు ఏజెన్సీలతో నిర్వహించేందుకు కసరత్తు చేస్తున్నారు.

### మళ్లీ టెండర్లు పిలువలేదు..

సీఆర్ఎంపీ కింద ప్రధాన మార్గాల్లోని రహదారుల నిర్వహణకు జీహెచ్ఎంసీ టెండర్లు ఆహ్వానిస్తోంది. ఐదేండ్ల కిందట ఈ పనుల్ని పెద్ద కాంట్రాక్ట్ ఏజెన్సీలకు ఇచ్చిన గడువు గత డిసెంబర్ –జనవరిల్లోనే ముగిసిపోయింది. కానీ ఇప్పటి వరకు మళ్లీ టెండర్లు పిలవలేదు. గతంలో మాదిరిగానే మళ్లీ పెద్ద ఏజెన్సీకు ఇచ్చే యోచనలో ఉన్న ఇంజినీరింగ్ అధికారులు ఈ మేరకు రెండు రకాల ప్రతిపాదనలతో స్టాండింగ్ కమిటీ ఆమోదం పొందిన విషయాన్ని తెలియజేస్తూ ప్రభుత్వ అనుమతి కోసం సచివాలయానికి పంపి వేచి చూస్తున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకా స్పష్టత రాకపోవడంతో తాత్కాలికంగా కొంతకాలం వరకైనా జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలోనే ఈ పనులు చేసేందుకు తాజాగా టెండర్లు పిలుస్తున్నారు.






# ముద్దుగుమ్మల సందడి

మిస్ వరల్డ్ ముద్దు గుమ్మలు నగరంలోని శిల్పారామం, విక్టోరియా భవనాన్ని సందర్శించారు. శిల్పారామంలో సాంస్కృతి, సంప్రదాయాల రూపాలను, చిత్రాలను ఆసక్తిగా తిలకించారు. కుండులు చేస్తూ మురిసిపోయారు. సరూర్‌నగర్‌లోని విక్టోరియా హోమ్‌ను వీక్షించి సంతోషం వ్యక్తం చేశారు. కాగా, మిస్ వరల్డ్ కంటెస్టెంట్స్‌కు ఈనెల 31న హైటెక్స్‌లో గ్రాండ్ ఫినాలే పోటీ ఉండనున్నది. ఇప్పటికే జరిగిన పోటీల్లో ఖండాల వారీగా 24 మంది విజేతలను ఎంపిక చేశారు. అందులో ఇండియా నుంచి నందిని గుప్తా ఉన్న విషయం తెలిసిందే. ఫైనల్ రౌండ్‌లో ప్రపంచ సుందరి ఎవరో తేలనున్నది.

- సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ)







# 50 శాతమూ పూర్తికాలే

## ఓల్డ్ సిటీ మెట్రో భూసేకరణకు ఎదురవుతున్న సవాళ్లు

### ముందుకు సాగని ప్రాజెక్టు .. భూసేకరణలో తీవ్ర జాప్యం



సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ) : అట్టహాసంగా ప్రారంభించిన ఓల్డ్ సిటీ మెట్రో భూసేకరణ అపసోపాలు పడుతోంది. క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న ఇబ్బందులు ప్రక్రియను ముందుకు సాగనివ్వడం లేదు. నాలుగు నెలల కిందట రెవెన్యూ, మెట్రో కలిసి భూసేకరణకు కసరత్తు ప్రారంభించినా... ఇప్పటి వరకు 50 శాతం కూడా పూర్తి కాలేదు. మతపరమైన, చారిత్రక కట్టడాల ప్రాంతాల్లో ఎదురవుతున్న ఇబ్బందులతో వేగంగా జరగాల్సిన భూసేకరణకు అడ్డంకులు వస్తున్నాయి. దీంతో భూములు సేకరిస్తే తప్ప.. ప్రాజెక్టును నిర్మించే వీలు లేకుండా పోయింది. ఆస్తులు సేకరించిన ప్రాంతంలో కూల్చివేతలు మొదలుపెట్టినా.. న్యాయపరమైన చిక్కులు మెట్రోను వెనక్కి లాగుతూనే ఉన్నాయి.

### 7.5 కిలోమీటర్ల మేర..

7.5కిలోమీటర్ల మేర ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించిన దాదాపు రూ. 2740 కోట్లతో నిర్మించనున్న మెట్రో కారిడార్‌కు నాలుగు నెలల కిందటే భూసేకరణ ప్రక్రియ మొదలైంది. నిర్ణీత గడువులోగా భూసేకరణ పూర్తి చేసేలా ముందస్తుగానే ఆస్తులను గుర్తించినా.. పరిహారం, న్యాయపరమైన అభ్యంతరాలు ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయి. ఓ వైపు మతపరమైన, చారిత్రక కట్టడాలు ఉండే ఈ ప్రాంతంలో భూసేకరణ పూర్తి అయితే తప్ప.. ప్రాజెక్టు ముందుకెళ్లే పరిస్థితి లేదు.

### వెయ్యికిపైగా ఆస్తులు ప్రభావితం

ఎంబీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు నిర్మించే మెట్రో మార్గం హైదరాబాద్ మెట్రో విస్తరణలో అత్యంత కీలకమైనది. మొదటి దశలోనే ఈ ప్రాజెక్టు పూర్తి కావాల్సి ఉన్నా.. క్షేత్రస్థాయిలో భూసేకరణ ఇబ్బందులు, కోర్టు వివాదాలు ప్రాజెక్టు పనులకు అడ్డుపడ్డాయి. దీంతో అప్పటి నుంచి ప్రతిపాదనలు, కాగితాలకే ఓల్డ్ సిటీ మెట్రో విస్తరణ పరిమితమైంది. అయితే ఇటీవల ఓల్డ్ సిటీ మెట్రో జాప్యంపై తీవ్ర విమర్శలు రావడంతో అనివార్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఓల్డ్ సిటీ మెట్రోను చాంద్రాయణగుట్ట వరకు పొడిగించి కొత్తగా కార్యాచరణ అమలు చేసింది. రూ.2741 కోట్ల అంచనా వ్యయంతో ఫేజ్–2 విస్తరణలో భాగంగా చేపట్టే ఈ ప్రాజెక్టు కోసం దాదాపు 1000కి పైగా ఆస్తులు ప్రభావితం అవుతున్నట్లు గుర్తించారు. ఇందులో మెట్రోకు అంగీకారం తెలిపిన వారి సంఖ్య వంద లోపే ఉంది. గడిచిన నాలుగు నెలలుగా 200లోపే ఆస్తులను సేకరించారు. భూయాజమాన్య హక్కుల పరిశీలన తర్వాత చెక్కులను పంపిణీ చేస్తున్నా.. భూసేకరణ ప్రక్రియ పూర్తి చేస్తేనే నిర్మాణ పనులు మొదలవుతాయి. క్షేత్రస్థాయిలో భిన్నమైన పరిస్థితులతో భూసేకరణ ప్రక్రియలో

మిగతా IVవ పేజీలో

# మంచినీళ్లివ్వండి మహా ప్రభో!

## జలమండలి ఎదుట కాంగ్రెస్ కార్పొరేటర్ నిరసన

**ఖైరతాబాద్, మే 22 :** రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనమిది. కాంగ్రెస్ పాలనలో వివిధ ప్రభుత్వ శాఖలు ముఖ్యమంత్రితో పాటు మంత్రులు, ప్రజాప్రతినిధులను ఖాతరు చేయడం లేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ పార్టీ కార్పొరేటర్లు, కార్యకర్తలే అధికార యంత్రాంగం పనితీరును ప్రశ్నిస్తుండడంతో మరో సారి ప్రభుత్వ వైఫల్యం వెలుగుచూసింది. సోమాజిగూడ డివిజన్‌లోని ఎంఎస్ మక్తాలో కొంత కాలంగా నల్లా నీటిలో మురునీరు వస్తుండడంతో పాటు అనేక చోట్ల లోప్రెషర్ సమస్య వేధిస్తున్నది. సుమారు 4వేలకు పైగా కుటుంబాలు ఉన్న ఎంఎస్‌మక్తాలో ఏడాదిన్నర కాలంగా పరిష్కారం కాని సమస్యగా మారింది. స్థానిక ప్రజలతో మిగతా IVవ పేజీలో



జలమండలి ఎండీ చాంబర్ ఎదుట బైఠాయించిన సోమాజిగూడ కార్పొరేటర్ సంగీత, ఆమె భర్త శ్రీనివాస్ యాదవ్

# ముఠా ఆట కట్టిస్తరా!

సిటీబ్యూరో, మే 22 (నమస్తే తెలంగాణ): రాచకొండ పోలీసులు ఇటీవల నకిలీ సర్టిఫికెట్ల ముఠాకు చెందిన 13 మందిలో ఆరుగురిని అరెస్ట్ చేశారు. అరెస్ట్ చేసిన వారిని రెండు రోజుల పాటు విచారణ కోసం పోలీస్ కస్టడీకి కోర్టు అనుమతిచ్చింది. దీంతో శుక్రవారం అరెస్టయిన వారిని సరూర్‌నగర్ పోలీసులు కస్టడీలోకి తీసుకొని విచారించనున్నారు. వివిధ రకాలైన 571 వివిధ రకాలైన ఫేక్ డాక్యుమెంట్లను ఈ ముఠా తయారు చేసింది. అందులో గతేడాది 280 నకిలీ సేల్ డీడ్స్‌ను పలువురికి విక్రయించినట్లు వెల్లడైంది. ఈ సేల్‌డీడ్‌లు కొనేవారు ఎవరు.. వారు ఎక్కడ వాటిని ఉపయోగించారు? వాటితో ఎన్ని వివాదాలు నడుస్తున్నాయి? ఈ నకిలీలతో కోర్టులో కేసులేసిన వారెందరు? బ్యాంకుల్లో ఈ డాక్యుమెంట్లు పెట్టి రుణాలు పొందిన వారెందరు..? ఇలా పలు అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది.

# నకిలీ ఔషధాలా? ఫిర్యాదు చేయండి

సిటీబ్యూరో: ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే నాణ్యమైన ఔషధాల తయారీతో పాటు నకిలీ, నాసిరకం ఔషధాల నియంత్రణ, ఔషధ విక్రయాల నిబంధనలను పర్యవేక్షించే డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ విభాగం కొత్తగా DCATelangana పేరుతో తన అధికారిక ఎక్స్ ఖాతాను తెరిచింది. ఔషధ తయారీ, విక్రయాలు, నాణ్యత తదితర అంశాలకు సంబంధించి ఫిర్యాదులుగాని, సమాచారంగాని ఎక్స్ వేదికగా తెలియజేయవచ్చని అధికారులు తెలిపారు.


